క్లుప్తంగా

ముగిసిన సువార్త కూడికలు



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న పీఠాధిపతులు జయరావు పొలిమేర, ఫాదర్స్

భీమడోలు: మరియమాత పునీతురాలని, దేవుని తల్లిగా మనమంతా ఆమెను ఆదర్శంగా తీసుకుని పుణ్యమార్గంలో నడవాలని ఏలూరు పీఠాధిపతులు రెవరెండ్ ఫాదర్ జయరావు పొలిమేర అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 38వ సజీవధారుల సువార్త కూడికలు సోమవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దైవ సందేశ కార్యక్రమానికి విచారణ కర్త ఫాదర్ షింటో థామస్ అధ్యక్షత వహించారు. దివ్య పూజాబలిని జయరావు పొలిమేర సమర్పించారు. మరియమాత దేవుని తల్లిగా జీవితం ధన్యురాలు అని, ఆమె జీవితం క్రైస్తవ విశ్వాసులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఫాదర్స్ జోబి, వికార్, జనరల్ ఫాదర్ బాల, విచారణకర్తలు షింటో థామస్, అమన్‌రాజు, డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పెదపాడులో వరి పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ జ్యోతి

పెదపాడు: రైతులు తమ పంటలను భద్రపరుచుకోవాలని తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి, వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్‌లు రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. రైతులకు తగిన సూచనలు చేశారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో నటరాజన్‌దాసు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



ఇండోర్ స్టేడియం వద్ద విద్యుత్ తీగల నుంచి వ్యాపించిన మంటలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీక్షణమైన ఎండతో భారీగా ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశంలో కారుమబ్బులు ఏర్పడ్డాయి. ఈదురు గాలులు వీచాయి. కొద్ది సేపు పెద్ద పెద్ద చినుకులతో వర్షం పడింది. ఈదురు గాలుల ప్రభావానికి ఏలూరు ఇండోర్ స్టేడియం సమీపంలో చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో మంటలు చెలరేగాయి. సుబ్బమ్మదేవి స్కూల్ రోడ్డులో ఒక చెట్టు కొమ్మ విద్యుత్ తీగలపై పడింది. కొత్త బస్టాండు సమీపంలో మరో చెట్టుకొమ్మ తీగలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తీగలపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నరసింహరావుపేటలో సాయంత్రం 6.30 గంటలకు ఆగిపోయిన విద్యుత్ సరఫరా రాత్రి 9.30 గంటల వరకు పునరుద్దరణ కాలేదు. నరసింహరావు పేట నివాసితులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు ఏలూరు అర్బన్ ఇన్‌చార్జి సీడీపీఓ కె.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వివాహిత మహిళలు అర్హులని, జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలని, కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అదనపు విద్యార్హతలకు ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోగా దరఖాస్తులను ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు, స్విమ్మింగ్ పూల్ వెనుక, ఏఎస్ఆర్ స్టేడియం, రైల్వే స్టేషన్ వద్ద ఏలూరు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేష్ సెల్ నెంబర్ 99493 69004లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి : బాపిరాజుగూడెం-2, రాయన్నపాలెం-3, సీతారంపురం, ఏపూరు, రామసింగవరం-1, వేగివాడ-1, జగనాథపురం-1, చింతలపాటివారిగూడెం, వడ్డి గూడెం, వసంతవాడ-3, పెదపాడు, శ్రీరామవరం-2, పోతునూరు-1, మలకచర్ల, అంజలిపురం, సత్యనారాయణపురం, సానిగూడెం.

కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారో?

- అర్హుల ఎదురుచూపులు
- ఓపెన్ కాని వెబ్‌సైట్
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు



సచివాలయం

దెందులూరు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలను గుప్పించారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారు. తీరా గద్దెనెక్కాక తమను గెలిపించిన ప్రజల సంక్షేమాన్ని మర్చిపోయారు. ముఖ్యంగా కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లే ఆధారం, ప్రతి నెల ఒకటో తేదీ కోసం వీరంతా ఆశగా ఎదురు చూస్తుంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్ సొమ్మును రూ.3వేలకు పెంచి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్‌ను రూ.4వేలకు పెంచింది. అయితే కొత్తగా ఒక్కరికీ కూడా పింఛన్ మంజూరు చేయలేదు.

కొత్త పింఛన్లు మాటే లేదు

కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు పూర్తవుతోంది. ఇప్పటి వరకూ కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది అక్టోబర్ ఒకటి నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇంత వరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు. అసలు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. నియోజకవర్గంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు, మండలాల్లో సుమారు 2వేలమందికి పైగా 60ఏళ్ల నిండినవారు ఉన్నారు. ఇక 50ఏళ్లు దాటిన వారు మరో 4 వేల మంది ఆశగా ఎదురుచేస్తున్నారు.

ఎదురుచూపులు

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు.

నియోజకవర్గ వారీగా వివరాలు

మండలం	పింఛన్‌దారులు
దెందులూరు	9348
పెదవేగి	12000
పెదపాడు	9600

దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజు పదుల సంఖ్యలో అర్హులు వెళుతున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పక్కాగా పింఛన్లు అందజేసేవారు. రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో ఇస్తే పింఛన్ల మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఈ పరిస్థితి మారిపోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వెబ్‌సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

50ఏళ్లకే పింఛన్ హామీ గాలికేనా...

సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 50ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పిన హామీ గాలికి వదిలేశారని బీసీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. బీసీకు సమన్యాయం చేస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని అడుగుతున్నారు.

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా హామీలను నెరవేర్చలేదు. పింఛన్లకోసం దరఖాస్తు చేసుకవడానికి ఇప్పటి వరకు వెబ్‌సైట్ కూడా ఓపెన్ కాలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తు చేయించేవారు.

– కత్తుల రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి

ప్రభుత్వం జీఓ ప్రకారం 2024 నవంబర్ ఒకటో తేదీ నుంచి వృద్ధాప్య పింఛన్ తీసుకునే వ్యక్తి ఒకటి నుంచి 15వ తేదీల మధ్య మరణిస్తే మరుసటి నెలకే ఆయన భార్యకు వితంతువు పింఛన్ మంజూరవుతుంది. 16నుంచి 30వ తేదీ మధ్య మరణిస్తే తదుపరి నెల కాకుండా మరో నెలలో పింఛన్ మంజూరవుతుంది. కొత్త పింఛన్లు దరఖాస్తు తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి.

– శ్రీనివాసరావు, ఎంపీడీఓ, పెదవేగి

ఈదురుగాలులతో రైతుల్లో కలవరం



భీమడోలు ఆర్ఎస్‌కే ప్రాంగణంలో ఆరబోసిన ధాన్యం

భీమడోలు: మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారడంతో రైతులు ఉలిక్కి పడ్డారు. భారీగా ఈదురు గాలులు వీయడంతో పాటు మోస్తారు వర్షం కురవడంతో రైతులు కంగారుపడ్డారు. ఇప్పటికే వరి కోత యంత్రాల సాయంతో రబీ ధాన్యం మాసూళ్లు చేసిన రైతులు తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై, ఖాళీ స్థలాల్లోను ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. దీనితో ఎక్కడ బడితే అక్కడ ధాన్యం ఉంది. అయితే ఒక్కసారిగా ఊహించని విధంగా ఈదురుగాలులతో పాటు వర్షం కురడంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం రాశులపై బరకాలు కప్పి భద్రపర్చుకున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేయాలని, కురిసిన వర్షం వల్ల ధాన్యం తడిసిందని రైతులు అంటున్నారు. అయితే ఈదురు గాలుల నేపథ్యంలో కోతకు సిద్ధంగా ఉన్న పంట గింజ రాలుతుందని, ఈ గాలులు రైతులకు నష్టాన్ని కలిగిస్తాయని రైతులు చెబుతున్నారు. ఈదురు గాలుల నేపథ్యంలో చెట్ల కొమ్మలు, ఆకులు విద్యుత్ వైర్లపై పడి తెగిపోయాయి. దీనితో మండల వ్యాప్తంగా సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అధ్వానంగా రహదారులు

- ఛిద్రమైన రోడ్లు
- రాకపోకలకు అవస్థలు



రోడ్డు మార్జిన్లలో మట్టి వేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలు నుంచి తల్లాపురం రహదారి గోతులమయంగా మారింది. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. అడుగుకో గుంత, గజానికో గొయ్యి ఉండటంతో రాకపోకలకు నరకం చూస్తున్నారు. గోతుల వల్ల ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. చేబ్రోలు నుంచి తల్లాపురం రహదారి పనులకు రూ.కోటి 29లక్షల వ్యయంతో జరుగుతున్న రహదారి పనులు నాసికరంగా జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత కరువైందన్నారు. గతంలో ఉండే తారు రోడ్డు పూర్తిగా శిథిలమైపోవడంతో 3.5కిలోమీటర్లు పొడవున్న రహదారికి కూటమి ప్రభుత్వం రూ.1.29 కోట్లు మంజూరు చేసింది. అక్కడి వరకు బాగానే ఉంది. రైతులు, ప్రజలు సంతోషించారు.

నిర్మాణంలో డొల్లతనం

ఈ రహదారిన తల్లాపురం ప్రజలతో పాటు అప్పారావుపేట గ్రామాల ప్రజలు, చేబ్రోలు రైతులు ఈ రహదారి గుండానే ప్రయాణాలు సాగిస్తుంటారు. నిత్యం ఈరహదారి పొడవునా ఉన్న పొలాల్లో పండిన వేలాది టన్నులు ధాన్యం లోడులు ఈ రహదారిపైనే వెళ్లాల్సి ఉంది. పండిన పంట ఈ రహదారిమీదుగా బయటకు రావాల్సి ఉంది. నిర్మాణంలో డొల్ల అయితే ఎంతకాలం రహదారి మన్నుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనున్న బోదెలో మట్టిని తవ్వి మార్జిన్లను నిర్మిస్తున్నారు.ఈ విషయంపై దీనిపై పీఆర్ ఏఈ కృష్ణమోహన్‌ని ప్రశ్నించగా ఎస్టిమేషన్‌లో ఎక్కడ కంకరవాడమని లేదని స్పష్టం చేశారు. గోతులు, పల్లంగా ఉన్నచోట్ల స్థానికంగా ఉండే మట్టిని వేసిన దానిపై రోల్ చేస్తున్నామని చెప్పారు. ఎటువంటి ఆందోళనకు తావులేకుండా రహదారి నిర్మాణం పటిష్టంగా చేయిస్తున్నామని వివరించారు.

క్షేత్ర పర్యటనలతో జ్ఞాన సముపార్జన



శెట్టిపేట హైడ్రల్ పవర్‌ప్రాజెక్టు వద్ద విద్యార్థులు

గణపవరం: విద్యార్థులు కేవలం తరగతి గదులు, పుస్తకాలకే పరిమితం కాకుండా క్షేత్ర పర్యటనలు చేయడంద్వారా మరింత ఎక్కువ జ్ఞానాన్ని పొందవచ్చని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్సు విభాగాల ఆధ్వర్యంలో డిగ్రీ బీఎస్‌సి విద్యార్థులు నిడదవోలు సమీపంలోని శెట్టిపేట హైడ్రల్ పవర్ ప్రాజెక్టు ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రల్ పవర్ ఉత్పత్తి విధానాన్ని పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఏఈ కృష్ణంరాజు, జేఈ షరీఫ్ విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి విధానం, నియంత్రణ వ్యవస్థలు, పునర్వినియోగ విద్యుత్‌కు సంబంధించిన ప్రాధాన్యతలను గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు కేవీ గణేష్‌కుమార్, గిరిబాబు, ఎ.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి

గణపవరం: గర్భిణులు తప్పనిసరిగా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవడం క్షేమదాయకమని గణపవరం పీహెచ్‌సి వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశాడే సందర్భంగా మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులను ఎర్లీగా రిజిస్ట్రేషన్ చేయడం, హైరిస్క్ వారిని గుర్తించి వెంటనే వారికి తగిన వైద్యసేవలు అందించడం, రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలు ఇవ్వడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రతి ఆశ వర్కర్ దగ్గర ప్రెగ్నెన్సీ కిట్లు కనీసం పది సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, ఆస్పత్రి ప్రసవాలు పెంచాలని,ప్రతీ నెలా హాస్టల్స్‌ను తప్పనిసరిగా విజిట్ చేయాలని, అవసరమైన వారికి మందులు ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

రైతులను అప్రమత్తం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

దెందులూరు: మారిన వాతావరణంకు అనుకూలంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేసి కోసిన ధాన్యాన్ని త్వరితగతిన గోడౌన్లకు పంపేలా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. మంగళవారం దెందులూరు కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో జరిగిన గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులందరికీ నాణ్యమైన గోనె సంచులు, ధాన్యం తేమ శాతం విషయంలో ఒకటి రెండు సార్లు నిబంధనలకనుగుణంగా పరిశీలించాలన్నారు. రైతులంతా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ధాన్యానికి రక్షణ కలిగేలా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామసభలో పలు సూచనలు చేశారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాష , డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ రెడ్డి, దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, ఆర్ఐ హేమమాలిని, మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు బీమాపై అవగాహన

ఉంగుటూరు: ఆక్వా రైతులు బీమా పొందే విధానంపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ఆక్వా రైతులకు ఇన్సూరెన్సు పొందే విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఇన్సూరెన్సు చేసుకోవడం వల్ల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో పెనుమత్స రామచంద్రరాజు, పొత్తూరి బెనర్జీరాజు, రాజశేఖర్‌వర్మ, కృష్ణంరాజు, య.నాగరాజు, శ్రీనివాసరెడ్డి, పి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

78 మందికి వైద్య పరీక్షలు



కొక్కిరపాడు గ్రామంలో దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెదపాడు: ప్రతి ఒక్కరూ దంత సంరక్షణ చేసుకుని నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సెయింట్ జోషఫ్ డెంటల్ కళాశాల ప్రజాదంత వైద్యవిభాగం హెచ్‌ఓడీ డా. పావన సంధ్య తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సెయింట్ జోషఫ్ డెంటల్ వైద్యులు కొక్కిరపాడు, వేంపాడు, దాసరిగూడెం గ్రామాల్లో 78మందికి ఉచిత దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారికి దంతాల్లో కలిగే రోగాలపైన, పరిశుభ్రతపైన అవగాహన కలిగించారు. గ్రామాల్లో దంతక్షయం, దంతరోగాలు కలిగిన వ్యక్తులను సమీపంలోని దంతవైద్యులను సంప్రదించేలా హెల్త్‌వర్కర్లు వారికి ప్రోత్సాహం అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరీదు రెడ్డియ్య, డా. టీ ప్రసాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సు మోటార్ సైకిలిస్టును ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణంలో సెల్‌ఫోన్ మెకానిక్ షేక్ అహ్మద్ షరీఫ్ ఈ నెల 6న సాయంత్రం తన స్నేహితుడిని గుర్వాయిగూడెంలో దించి, తిరిగి జంగారెడ్డిగూడెం వస్తుండగా స్థానిక సాయిబాబ స్థూపం వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. షరీఫ్ తలకు బలమైన గాయమవడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఏసుక్రీస్తు సువార్త మహాసభలు



సీడీని ఆవిష్కరిస్తున్న సంఘ పెద్దలు

దెందులూరు: దేవునికి దీవెనకరంగా ప్రతి ఒక్కరు జీవించాలని ప్రముఖ సువార్తికులు జాన్ వెస్లీ అన్నారు. దెందులూరు మన్న చర్చి పాస్టర్ బెంజిమెన్ సంఘస్తులు సంయుక్త ఆధ్వర్యంలో దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో ఏసుక్రీస్తు సువార్త మహాసభలు రెండవ రోజు జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సువార్తికులు జాన్ వెస్లీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక అభివృద్ధి ప్రతి ఒక్కరికి ఆదర్శవంతం కావాలన్నారు. దేవుని సువార్త దశదిశల ప్రకటించబడాలన్నారు. ప్రతి ఒక్కరు దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా ఆయన చూపిన మార్గంలో నడుస్తూ రక్షణ పొందాలన్నారు. అనంతరం పాస్టర్ బెంజిమెన్ దెందులూరు మండలం పాస్టర్ అసోసియేషన్ గౌరవ పాస్టర్ విలియం మన సంఘం పెద్దలు సభ్యులు యువత నూతన గీతాన్ని ఆవిష్కరించారు. ఏసుక్రీస్తు సువార్త మహాసభలకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రం పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని, పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేసి లీటరుకు రూ.2 తగ్గించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 చొప్పున కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడం దారుణమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయని, అందుకు అనుగుణంగా పెట్రో ల్, డీజిల్ ధరలు తగ్గించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ ఎంపీల మద్దతుతోనే కేంద్రంలో బీజేపీ పాలన సాగిస్తుందని, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసేటప్పుడు నిలదీయాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం

- ఏలూరులో పార్టీ కుటుంబ ఆత్మీయ సమావేశం
- మార్మోగిన జై జగన్ నినాదాలు



సమావేశంలో సమన్వయకర్తలు బాలరాజు, విజయరాజు, ముఖ్యనేతలతో ఏలూరు సమన్వయకర్త జేపీ

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ జెండా ఏలూరు నగరంలో రెపరెపలాడింది. పార్టీ శ్రేణులు, నేతలు నగరంలో కథంతొక్కారు. పార్టీ జెండాలను మోటారు సైకిళ్లు, కార్లకు పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. 10 నెలల కూటమి ప్రభుత్వ కంతక పాలనకు చెరమగీతం పాడేందుకు ఇప్పటి నుంచే తామంతా సిద్ధమంటూ నినదించారు. ఏలూరు మినీబైపాస్‌లోని క్రాంతి కల్యాణ మండపంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా కార్యకర్తల, నేతల ఆత్మీయ సమావేశం శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. కల్యాణ మండప ప్రాంగణం, సమావేశ మందిరం జై జగన్ నినాదాలతో మారుమోగింది.

ఏడాది పూర్తికాకుండానే వ్యతిరేకత

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తికాకముందే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటోంది. కూటమి సర్కార్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టినా, దౌర్జన్యం చేసినా, దాడులు చేసినా, బెదిరేదిలేదంటూ శ్రేణులు భారీ సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. మరోవైపు మండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు ఈలలు, చప్పట్లు, నినాదాలతో హోరెత్తించారు. పార్టీ నేతలతో తామంతా ఉన్నాం.. జై జగన్ అంటూ నినదించారు. నేతల ప్రసంగాలతో శ్రేణులు ఉత్సాహంతో ఊగిపోయారు.

సైనికుల్లా పనిచేద్దాం

పేదల పక్షపాతి, సంక్షేమ రథసారధి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేద్దామని పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పిలుపునిచ్చారు. నాడు దివంగత మహానేత వైఎస్సార్ రాష్ట్రంలో నూతనంగా సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, గత ఐదేళ్ల ప్రజారంజక పాలనతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాలను గెలుచుకున్నారని గుర్తుచేశారు. గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు నగరం అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ పాలన కావాలన్నారు.